# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరుగుతోంది.**

**2) రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మారుస్తున్నామని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

**3) వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు విడతల వారీగా నష్ట పరిహారం చెల్లిస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

**4) రాగల రెండు రోజులపాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతవరణ కేంద్రం పేర్కొంది.**

==========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి మంత్రులు కె.అచ్చెన్నాయుడు, టీజీ భరత్, వి.సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాదికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఇంధన రంగం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల రంగానికి చెందిన వివిధ ప్రాజెక్టులపై ఎస్ఐపీబీ సమావేశంలో చర్చ జరుగుతోంది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి పెట్టుబడులు, భూకేటాయింపుల ప్రతిపాదనలపై చర్చించి ఆపై ఎస్ఐపీబీ ఆమోదం తెలుపనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రాన్ని పారిశ్రామిక కేంద్రంగా మారుస్తున్నామని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో వెయ్యి కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న క్యారియర్ ఎసి పరిశ్రమకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడిదారులు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. అమెరికాకు చెందిన క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ శ్రీసిటీలో ఏర్పాటు చేస్తున్న క్యారియర్ ఏసీ తయారీ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మంత్రి లోకేష్ లభిస్తాయని చెబుతూ ...

వాయిస్...27 సెకన్లు

---

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 5 చెక్కులను మంత్రి లబ్ధిదారులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య కారణాల కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు.

---

పల్నాడు జిల్లా పిడుగు రాళ్ల భోధనాసుపత్రిలో ఈ నెల 20 నుంచి ఔట్ పేషెంట్ సేవలు ప్రారంభిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వైద్య కళాశాలలు వసతి గృహాలు నిర్మాణం, వైద్య సిబ్బంది నియామకం మొదలైన అంశాలపై ఆయన అమరావతి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోగులు ఆస్పత్రికి వచ్చేందుకు వీలుగా రవాణా సౌకర్యాలు కల్పించాలని, ఈ విషయమై ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఆయన అన్నారు. నిర్మాణ సంస్థతో మాట్లాడి ఈ నెల 20 కల్లా నిర్మాణ పనులు పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---

ఖరీఫ్, రబీల్లో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన శనగ, కందులు, పెసరకు సంబంధించి రైతులకు బకాయిలు విడుదల చేసినట్లు సంస్థ మార్క్ ఫెడ్ జనరల్ మేనేజర్ లక్ష్మణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాఫెడ్, మార్క్ ఫెడ్ కలిసి ఇప్పటి వరకు 963 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని, నిన్న 52 కోట్ల రూపాయలు విడుదల చేశామని వివరించారు.

---

ప్రకాశం జిల్లా వెలి గొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని జల వనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంత్రి నిన్న ప్రకాశం జిల్లా డోర్నాల వద్ద వెలిగొండ ప్రాజెక్టు పనులను టన్నెల్ లోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---

అమరావతి సచివాలయంలో రేపు, ఎల్లుండి కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. జిల్లాల అభివృద్ధి, పాలనా వ్యవహారాల్లో మెరుగైన నిర్వహణ తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. గత రెండు నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటిపై ప్రజల సంతృప్తి స్థాయి, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై వారి స్పందన వంటి కీలక అంశాలపైనా కలెక్టర్ల సదస్సులో చర్చించనున్నారు.

---

తిరుమలలోని అన్నమయ్యభవన్ లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈరోజు జరుగుతోంది. టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు అధ్యక్షతన పాలకమండలి సభ్యులు సమావేశమయ్యారు. వేసవి

సెలవులు కావడంతో తిరుమలలో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా భక్తుల కోసం తీసుకోవాల్సిన ప్రత్యేక ఏర్పాట్లతో పాటు మరికొన్ని అంశాలపై టిటిడి పాలకమండలి చర్చిస్తోంది.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులను సృజనాత్మకంగా, సామర్థ్యవంతులుగా తీర్చిదిద్దడానికి అనుభవజ్ఞులు, విద్యావంతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. భీమవరంలో మీ సేవలను అందించండి పేరిట రూపొందించిన వేసవి శిక్షణా తరగతుల గోడ పత్రికను ఆమె నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వివిధ సృజనాత్మక, సామాజిక, సాంకేతిక అంశాలపై మార్గదర్శనం చేయడానికి ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా సేవలు అందించాలని కోరారు.

---------------------------

ప్రముఖ నిర్మాత, సూపర్ గుడ్ ఫిల్మ్ అధినేత ఆర్ బి చౌదరి మరణం దిగ్భ్రాంతి కలిగించిందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అయన దుర్మరణం చెందారనే దుర్వార్త నమ్మలేకపోయానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఏలూరు జిల్లాలో జరుగుతున్న రోడ్ ఓవర్ బ్రిడ్జి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. భూసేకరణలో రైతులు,ప్రజలు నుండి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా, శాంతిభద్రతలు సమస్యలు తలెత్తకుండా లక్ష్యాలను సాధించాలని నిన్న ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో అన్నారు. ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు నియోజకవర్గాలలోని పనులపై కలెక్టర్ సమీక్షించారు. భూములు ఇచ్చిన వారికి త్వరితగతిన నష్టపరిహారాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.

---------------------------

తిరుపతిలో ఈరోజు ప్రారంభమైన గంగమ్మ జాతరలో భాగంగా భక్తులు బైరాగి వేషంలో అమ్మవారికి మట్నుక్కులు సమర్పించుకుంటున్నారు. శరీరమంతా నామం కొమ్ము, విభూది పూసుకుని రేళ్ళ కాయల మాలలు ధరించి ఆలయానికి చేరుకుంటున్నారు. ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాయలసీమ నుంచి వస్తున్న భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

---------------------------

గోదావరి – కావేరి నదుల అనుసంధాన పథకంపై జాతీయ జలాల అభివృద్ధి సంస్థ –ఎన్‌డబ్ల్యూడీఏ– ఆధ్వర్యంలో ఎల్లుండి సమీక్ష జరుగనుంది. ఈ మేరకు ఎన్‌డబ్ల్యూడీఏ నిన్న రాష్ట్రాలకు సమాచారం అందజేసింది.

---------------------------

ఉత్తర దక్షిణ ద్రోణి, ఉత్తర అంతర కర్ణాటక నుంచి రాయలసీమ,తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ చెప్పారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరిస్తూ

వాయిస్...27 సెకన్లు

=====================